క్లుప్తంగా

గుత్తి కోటను సందర్శించాలని కలెక్టర్‌కు ఆహ్వానం



కలెక్టర్‌ను సన్మానిస్తున్న గుత్తి కోట సంరక్షణ సమితి సభ్యులు

గుత్తి: చరిత్రాత్మకమైన గుత్తి కోటను సందర్శించాలని నూతన జిల్లా కలెక్టర్ ఆనంద్‌కు గుత్తి కోట సంరక్షణ సమితి సభ్యులు కోరారు. గుత్తి కోట సంరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు విజయభాస్కర్, సభ్యులు సాధు శేఖర్, సూర్య నారాయణరెడ్డి, బాబా సాహెబ్, వీరేష్, రంగస్వామి, శివ తదితరులు బుధవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ ఆనంద్‌ను కలిసి గుత్తి కోట ప్రాముఖ్యతను వివరించారు. గుతి కోటను సందర్శించాలని ఆహ్వానించారు. అనంతరం శాలువాలు, పూల మాలలతో ఆయన్ను ఘనంగా సన్మానించారు.

ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి



సభ్యత్వ నమోదు రశీదులను అందజేస్తున్న మాధవ్

గుంతకల్లుటౌన్: రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికుల సమస్యలను పరిష్కరించే వరకు పోరాడుతామని ఏపీ ఎన్‌జీఓ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జె.మాధవ్ అన్నారు. బుధవారం తహసీల్దార్, ఎంపీడీఓ, సబ్ ట్రెజరీ, అర్బన్ హెల్త్ సెంటర్లల్లో అధికారులు, ఉద్యోగులను ఆయన కలిశారు. అనంతరం ఎన్‌జీఓ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పీఆర్సీతో పాటు పెండింగ్‌లో ఉన్న డీఏలు, ఇతర బకాయిలన్నింటినీ విడుదల చేయాలని, ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలన్నారు. అనంతరం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించి ఉద్యోగులకు సభ్యత్వ రశీదులను అందజేశారు. ఏపీఎన్‌జీఓ తాలుకా కార్యదర్శి రామాంజనేయులు, ఉపాధ్యక్షులు ఎర్రిస్వామి, కృష్ణ, నాయకులు పవన్, ప్రసాద్, సుధాకర్, శివయ్య, గ్రేస్, పద్మలత తదితరులు పాల్గొన్నారు.

బెట్ట నుంచి పంటలను కాపాడుకోండి



పంటలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

గుత్తి రూరల్: పంటలు సాగు చేసిన రైతులు బెట్ట పరిస్థితుల నుంచి పంటలను కాపాడుకోవాలని అనంతపురం రేకులకుంట, వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు డాక్టర్.అరుణకుమారి. డాక్టర్.లక్ష్మణ్ సూచించారు. మండలంలోని వన్నేదొడ్డి క్లస్టర్ పరిధిలోని కరిడికొండ, బాచుపల్లి గ్రామాల్లో రైతులు సాగు చేసిన ఆముదం, కంది, వేరుశనగ పంటలను బుధవారం శాస్త్రవేత్తలు పరిశీలించారు. వేరుశనగ పంటలో ప్రస్తుతం బెట్ట పరిస్థితులున్నాయని బెట్టను తట్టుకునేందుకు పొటాషియం నైట్రేట్ లీటరు నీటిలో ఐదు గ్రాములు కలిపి పంటపై పిచికారీ చేయాలన్నారు. తద్వారా బెట్ట పరిస్థితులు తట్టుకొని కాయ బాగా ఊరి అధిక దిగుబడులు వచ్చే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు జయచంద్ర, దివ్య, సోమశేఖర్ పాల్గొన్నారు.

గుంతకల్లులో అరి సినిమా సందడి



మాట్లాడుతున్న చిత్ర నిర్మాత తిమ్మప్పనాయుడు, రామలింగప్ప

గుంతకల్లు: స్థానిక వాసవీ థియేటర్‌లో బుధవారం అరి సినిమా విడుదల సందర్భంగా సందడి నెలకొంది. గుంతకల్లు మండలం అమీన్‌పల్లికి చెందిన పురిమెట్ల తిమ్మప్పనాయుడు నిర్మాతగా ఆయన కుమారడు పురిమెట్ల సూర్య హీరోగా నటించిన ఈ సినిమాలో అనసూయ, సాయికుమార్, సుమన్, శ్రీకాంత్ అయ్యంగార్, అమల, శుభలేఖ సుధాకర్, హాస్యనటులు శ్రీనివాసరెడ్డి, చమ్మక్ చంద్ర తదితరులు నటించారు. ఈ సందర్భంగా థియేటర్ వద్ద సూర్య అభిమానులు పెద్ద ఎత్తున టపాసులు పేల్చి సందడి చేశారు. అనంతరం చిత్ర నిర్మాత పురిమెట్ల తిమ్మప్ప నాయుడుతో కలిసి వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ మున్సిపల్ చైర్మన్ ఎస్.రామలింగప్ప, శంకరానందగిరి స్వామి కరస్పాండెంట్ కేసీ హరి తదితరులు మాట్లాడుతూ గ్రామీణా ప్రాంతానికి చెందిన పురిమెట్ల సూర్య మరింతగా రాణించి గుంతకల్లు పేరుప్రతిష్టాలు దేశ వ్యాప్తంగా చాటాలని ఆకాంక్షించారు. నిర్మాత మాట్లాడుతూ అర్షద్వర్గాల చుట్టూ అల్లుకున్న కథతో రూపొందిన చిత్రమే అరి అన్నారు.

వైద్య విద్యను దూరం చేయడానికి బాబు కుట్ర

- మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త సాకే శైలజానాథ్



మాట్లాడుతున్న మాజీ మంత్రి, నియోజకవర్గ సమన్వయకర్త సాకే శైలజానాథ్

శింగనమల(నార్పల): పేదలకు వైద్య విద్య దూరం చేయడానికి చంద్రబాబు కుట్ర పన్నారని, అందుకే వైద్య కళాశాలలను ప్రైవేటీకరిస్తున్నారని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త సాకే శైలజానాథ్ ధ్వజమెత్తారు. నార్పల మండలం గూగూడు, గంగనపల్లి, మంగపట్నం, సోదనపల్లి, నలపరెడ్డి పల్లి, గుంజేపల్లి గ్రామాల్లో బుధవారం వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు ఖాదర్ వలి ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణపై రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా సాకే శైలజానాథ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వైద్య విద్య కళాశాలలను ప్రైవేటీకరణ చేసి, బడా నేతలకు అప్పగించాలని చూస్తోందన్నారు. దీనికి చెక్ పెట్టేందుకు వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కోటి సంతకాల సేకరణ కార్యక్రమం తలపెట్టారన్నారు. ప్రజలు స్వచ్ఛందంగా కార్యక్రమంలో పాల్గొని కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.

బాబు డైవర్షన్ పాలిటిక్స్

సీఎం చంద్రబాబు ఎన్నికల హామీలు నెరవేర్చలేక డైవర్షన్ పాలిటిక్స్‌కు చేస్తూ కాలం గడుతున్నారని శైలజానాథ్ విమర్శించారు. బాబు కుట్రలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు సూచించారు. అనంతరం ప్రజలతో సంతకాలు సేకరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ కార్యదర్శి నార్పల సత్యనారాయణరెడ్డి, జెడ్పీ వైస్ చైర్ పర్సన్ నాగరత్నమ్మ, ఎంపీపీ నాగేశ్వరరావు, యల్లనూరు జెడ్పీటీసీ భోగాతి ప్రతాప్‌రెడ్డి, పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శులు మిద్దె కుళ్లాయప్ప, చాములూరు రాజగోపాల్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ప్రతాప్‌రెడ్డి, బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు ఫణీంద్ర, జయరామిరెడ్డి, శంకర్‌రెడ్డి, శివయ్య, ఎంపీటీసీ రాజారెడ్డి, వెంకటనారాయణరెడ్డి, రమణయ్య, రంగారెడ్డి, సర్పంచ్ రాంభూపాల్‌రెడ్డి, శివారెడ్డి, రామలింగారెడ్డి, ఎంపీటీసీ కాటమయ్య, సర్పంచ్ రామాంజినేయులు, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

నేడు నాలుగు గ్రామాల్లో 'రచ్చబండ'

పుట్లూరు: మండలంలోని కడవకల్లు, సూరేపల్లి, అరకటివేముల, ఏ.కొండాపురం గ్రామాల్లో గురువారం 'రచ్చబండ' కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పి.మహేశ్వరరెడ్డి తెలిపారు. కార్యక్రమానికి శింగనమల నియోజకవర్గ సమన్వయకర్త శైలజానాథ్ హాజరవుతారన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

బండి కాదు ఇది..



బస్సును వెనుక నుంచి తోస్తున్న ప్రయాణికులు

తాడిపత్రి రూరల్: పట్టణంలోని యల్లనూరురోడ్డుపై బుధవారం సెల్ఫ్‌లేక ఆర్టీసీ బస్సు(తాడిపత్రి -సింహాద్రిపురం సర్వీసు) నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇక్కట్లు తప్పలేదు. ప్రయాణికులు కిందకు దిగి బస్సును తోయడంతో స్టార్ట్ అయింది. దీంతో ప్రయాణికులు హమ్మయ్యా అంటూ ఊపిరిపీల్చుకుని ప్రయాణాన్ని కొనసాగించారు.

సుంకులమ్మ విగ్రహ ప్రతిష్ట

శింగనమల: శింగనమలలోని చెరువు సమీపంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో సుంకులమ్మ విగ్రహం ప్రతిష్ట బుధవారం జరిగింది. ఈసందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేపట్టారు.

మున్సిపల్ కార్యాలయంలో పారిశుధ్య పనులు



ఆఫీసు ఆవరణలో పిచ్చిమొక్కలను తొలగిస్తున్న కార్మికులు

సాక్షి ఎఫెక్ట్..

గుంతకల్లుటౌన్: మున్సిపల్ కార్యాలయంలో అధికారులు ప్రత్యేక పారిశుధ్య పనులు చేపట్టారు. 'మున్సిపల్ కార్యాలయ ఆవరణలో కంపు' శీర్షికన సాక్షి ప్రచురించిన కథనానికి మున్సిపల్ అసిస్టెంట్ కమీషనర్ లక్ష్మిదేవి స్పందించారు. బుధవారం మున్సిపల్ కార్యాలయ ఆవరణలో పీహెచ్ వర్కర్ల చేత ప్రత్యేక పారిశుధ్య పనులు చేయించారు. మున్సిపల్ కమిషనర్, ఎంఈల ఛాంబర్‌ల వద్ద కంపుకొడుతున్న పరిసరాలను శుభ్రం చేయించి సున్నం వేయించారు. జనరేటర్ రూమ్ పక్కన ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలు, జంబుగడ్డిని తీసి వేయించారు.

మాజీ మంత్రి పెద్దిరెడ్డిని కలిసిన పామిడి వీరా



మాజీ మంత్రి పెద్దిరెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న వీరా

పామిడి: తిరుపతిలో మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని బుధవారం ఏడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ పామిడి వీరాంజనేయులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా ఆయన పార్టీ అభ్యున్నతికి పాటు పడాలని వీరాకు సూచించారు. నాయకులు నీలంసాయినాథ్‌రెడ్డి, దుర్గా ఫర్టిలైజర్స్ శీనా ఉన్నారు.

అబ్దుల్ కలామ్ ఆశయాలను కొనసాగిస్తాం



గుంతకల్లులో కలామ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

గుంతకల్లుటౌన్: దివంగత మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే.అబ్దుల్ కలామ్ ఆశయాలను కొనసాగిస్తామని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నియోజకవర్గం అధ్యక్షుడు అబ్దుల్‌బాసిద్, ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి బావన్న అన్నారు. కలామ్ 94వ జయంతి సందర్భంగా బుధవారం వైఎస్సార్‌సీపీ నాయకులు 60 అడుగుల రోడ్డులోని ఆ మహనీయుడి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఏపీజే కలామ్ ప్రపంచం గర్వించదగ్గ గొప్ప శాస్త్రవేత్త అని, యువతకు మార్గనిర్దేశకుడన్నారు. దేశప్రతిష్ట కోసం పరితపించిన దేశభక్తుడని కొనియాడారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం పట్టణ అధ్యక్షుడు ఎంఎం.రెహమాన్, అనుబంధ విభాగాల నియోజకవర్గం అధ్యక్షులు రంగనాయకులు, కొనకొండ్ల అంజి, సూర్యరెడ్డి, బాబురావు, ఎస్సీసెల్ పట్టణ అధ్యక్షుడు నల్లన్న, పోలింగ్‌బూత్ అధ్యక్షుడు జన్నే మస్తాన్, రాజశేఖర్, నాయకులు వీరన్న, హుసేన్, మురళీ, వెంకటేష్, మహాలింగ, ఫయాజ్, అనిల్, మైనూ, రమేష్, డిష్ రాము, సుబ్బరాయుడు, దాదూ తదితరులు పాల్గొన్నారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి కలామ్

యాడికి: దివంగత మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే.అబ్దుల్ కలామ్ బహుముఖ ప్రజ్ఞాశాలి అని యాడికి ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సీతారామాంజనేయులు, స్టాంప్ రైటర్ రజాక్, ఉపాధ్యాయులు పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఉన్నత పాఠశాల ముందున్న అబ్దుల్ కలాం విగ్రహం వద్ద ఆయన 94వ జయంతిని ఘనంగా నిర్వహించారు. విజన్ పాఠశాలలో కలామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో విశ్వనాథ్, నారాయణ స్వామి, సురేష్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జీఎస్టీ పేరుతో దోపిడీ



మాట్లాడుతున్న నారాయణస్వామి

గుంతకల్లు: జీఎస్టీ పేరుతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సామాన్యుల నుంచి రూ.కోట్లు దోపిడీ చేస్తున్నాయని సీపీఐ జిల్లా కార్యదర్శి నారాయణస్వామి విమర్శించారు. పట్టణ సీపీఐ ఆధ్వర్యంలో పట్టణ సమస్యలను పరిష్కారించాలని డిమాండ్ చేస్తూ స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద చేపట్టిన సామూహిక దీక్ష శిబిరాన్ని ఆయన బుధవారం సందర్శించి మాట్లాడారు. ఏదో ఘనకార్యం చేసినట్టు సూపర్ జీఎస్టీ..సూపర్ సేవింగ్ పేరుతో కర్నూలులో పెద్ద బహిరంగ సభ పెట్టడం హాస్యాస్పదంగా ఉందన్నారు. సీపీఐ నాయకులు బీ.మహేష్, గోపీనాథ్, ఎస్‌ఎండీ గౌస్, రాముఠాయల్, రామాంజినేయులు, ఈశ్వరయ్య, మల్లయ్య, డైమండ్ నూర్ తదితరులను రెండవ రోజు దీక్షలో కూర్చొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి



చేతులను శుభ్రం చేసుకునే విధానాన్ని చూపిస్తున్న ఎంపీడీఓ ప్రభాకర్ నాయక్

గుత్తి రూరల్: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించి ఆరోగ్యవంతులుగా ఉండాలని ఎంపీడీఓ ప్రభాకర్ నాయక్ పేర్కొన్నారు. పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం గ్లోబల్ హ్యాండ్ వాషింగ్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ కార్యాలయ, ఉపాధి హామీ సిబ్బందికి చేతులను శుభ్రం చేసుకునే విధానాన్ని చూపించారు. కార్యక్రమంలో ఏపీఓ రమేష్, కార్యాలయ సిబ్బంది భాస్కర్, అబ్దుల్, వాసు, తదితరులు పాల్గొన్నారు.

గుత్తి: పిల్లలు చేతులను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అంగన్వాడీ కార్యకర్తలు నాగలక్ష్మి, పార్వతి అన్నారు. గుత్తి మున్సిపాలిటీ పరిధిలోని గుడ్ విల్స్ స్కూల్లో సీడీపీఓ భారతి ఆధ్వర్యంలో గ్లోబల్ హ్యాండ్ వాష్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భోజనం తినక ముందు, తిన్న తర్వాత చేతులను పరిశుభ్రంగా కడుక్కోవాలన్నారు. హెచ్‌ఎం రమాదేవి, అంగన్‌వాడీ టీచర్లు శాంతి, సుజాత, ప్రణవి తదితరులు పాల్గొన్నారు.

యాడికి: ప్రతి ఒక్కరూ చేతుల శుభ్రత పాటించాలని ఎంపీడీఓ వీర్రాజు సూచించారు. బుధవారం నగరూరు అంగన్‌వాడీ కేంద్రంలో జరిగిన ప్రపంచ చేతుల శుభ్రత దినోత్సవానికి హాజరయ్యారు. అనంతరం వేముల పాడు, నగరూరు, రాయలచెరువు సచివాలయాలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు.

గార్లదిన్నె: ప్రతి ఒక్కరూ చేతుల్ని పరిశుభ్రంగా ఉంచుకోవడం వల్ల ఆరోగ్యం కాపాడు కోవ చ్చునని ఎంపీడీఓ యోగానంద రెడ్డి పేర్కొన్నారు. బుధవారం గార్లదిన్నె ప్రాథమిక పాఠశాలలో గ్లోబల్ హ్యాండ్ వాషింగ్ డే నిర్వహించారు.

విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానం అవసరం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ బాలకృష్ణ

బుక్కరాయసముద్రం: విద్యార్థులకు చదువుతో పాటు సాంకేతిక పరిజ్ఞానం ఎంతో అవసరమని ఎస్‌ఆర్‌ఐటీ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బాలకృష్ణ పేర్కొన్నారు. బుధవారం రోటరీపురంలోని ఎస్‌ఆర్‌ఐటీ ఇంజినీరింగ్ కళాశాలలో నేషనల్ లెవల్ టెక్నికల్ సింపోజియం నెక్స్‌జెన్–2కె25 టెక్నికల్ ఫెస్ట్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ సదస్సుకు దేశ వ్యాప్తంగా 1200 మంది విద్యార్థులు వివిధ ఈవెంట్లకు రిజిస్టర్ చేసుకున్నారని తెలిపారు. పేపర్ ప్రెజెంటేషన్ ప్రాజెక్ట్ ఎక్స్‌పో, హ్యాకథాన్, కోడ్ బజ్, ఐఓటీ హ్యాకథాన్, టెక్నికల్ క్విజ్, సర్క్యూట్ మానియా, మోడల్ ఎక్స్‌పో తదితర పోటీలు నిర్వహించి ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు బహుమతితో పాటు సర్టిఫికెట్లు అందజేశామన్నారు. కళాశాల వైస్ ప్రసిడెంట్ డాక్టర్ రంజిత్‌రెడ్డి, ప్రోగ్రాం కోఆర్డినేటర్ చిత్రలింగప్ప, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్, ఐక్యూఏసీ డైరెక్టర్ డాక్టర్ సాయి చైతన్య కిషోర్, పోగ్రాం కన్వీనర్ హేమంత్‌కుమార్ పాల్గొన్నారు.

అర్హతకు మించి వైద్యం చేస్తే చర్యలు



ప్రథమ చికిత్సా కేంద్రంలోని మందులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ ఈబీ దేవి

యాడికి: ఆర్‌ఎంపీలు అర్హతకు మించి వైద్యం చేస్తే చర్యలు తీసుకుంటామని జిల్లా వైద్యాధికారి ఈబీ దేవి హెచ్చరించారు. బుధవారం మండల కేంద్రంలోని కోనుప్పలపాడు రహదారిలో ఉన్న ప్రథమ చికిత్స కేంద్రాన్ని డీఎంహెచ్‌ఓ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ ఉన్న మందులను పరిశీలించి సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆర్‌ఎంపీలు ప్రాథమిక చికిత్స మాత్రమే చేయాలన్నారు. గర్భిణులు, రెండేళ్లలోపు పిల్లలకు వైద్యం చేయరాదని తెలిపారు. సీఐ ఈరన్న, వైద్యుడు పరమేశ్వర పాల్గొన్నారు.

యాడికి: కమలపాడు గ్రామ సచివాలయాన్ని బుధవారం అనంతపురం వైద్య కార్యాలయ అధికారి శైలజతో పాటు యాడికి డాక్టర్ పరమేశ్వర వైద్య సిబ్బంది ఆకస్మిక తనిఖీ చేసి పలు రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు నేషనల్ క్వాలిటీ వైద్య బృందంతో వీడియో కాల్‌లో మాట్లా డారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

కర్నూలులో హైకోర్టు ఏర్పాటు చేయాలి



నిరసన తెలియజేస్తున్న న్యాయవాదులు

గుంతకల్లుటౌన్: శ్రీభాగ్ ఒప్పందం ప్రకారం ఏపీ హైకోర్టును కర్నూలులో ఏర్పాటు చేయాలని బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు జయరామ్, రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం బార్ న్యాయవాదులు తమ విధులను బహిష్కరించి బార్ అసోసియేషన్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒకప్పటి ఆంధ్రప్రదేశ్ రాజధాని కర్నూలుకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. 2014లో రాష్ట్ర విభజన సందర్భంగా నాయకులు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని, కర్నూలులో హైకోర్టును ఏర్పాటు చేయాల్సిందేనని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ సెక్రటరీ తిమ్మప్ప, సీనియర్ న్యాయవాదులు నాగరాజు, గోపాలకృష్ణ, వెంకటనాయుడు, నాగేషు, చెన్నకేశవులు, గురుప్రసాద్, బడేసాబ్, సురేష్, పెద్దతిమ్మారెడ్డి, వీఎస్.రావు, మస్తాన్‌వలి, బాబు, వెంకటేశులు, ధనుంజయ, రవీంద్ర, రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

టపాసుల విక్రయాలకు అనుమతి తప్పనిసరి

శింగనమల: శింగనమల పోలీస్ సర్కిల్ పరిధిలో టపాసుల విక్రయాలకు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని సీఐ కౌలుట్లయ్య తెలిపారు. బుధవారం స్థానిక సర్కిల్ కార్యాలయంలో టపాసుల విక్రయదారులతో సమావేశం నిర్వహించారు. అనంతరం నాగులగుడ్డం వద్ద నున్న గోడౌన్‌ను పరిశీలించారు.

భవిష్యత్ అంతా స్టార్టప్స్‌దే



మాట్లాడుతున్న బోధిసత్వ కుందు

గుత్తి: భవిష్యత్ అంతా స్టార్టప్స్‌దేనని ప్రముఖ బిజినెస్ డెవలప్‌మెంట్ ట్రైనర్ బోధిసత్వ కుందు అన్నారు. గుత్తి గేట్స్ ఇంజనీరింగ్ కాలేజీలో వారం రోజులుగా సయెంట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఐసీటీ అకాడమీ నిర్వహిస్తున్న ఎంట్రప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ బుధవారం ముగిసింది. ఈ సందర్భంగా ఆయన స్టార్టప్స్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ వీకే పద్మావతమ్మ, డైరెక్టర్ వాణి, ఎండీ రఘునాథ్ రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్, ఏఓ ఇంతియాజ్ బాషా, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ తనీవ్వర్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

పామిడి: రోడ్డు ప్రమాదంలో గాయపడి హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వృద్ధుడు మృతి చెందాడు. పట్టణంలోని ఆముదాల వీధికి చెందిన మాధవ కొండన్న(69) గత నెల 12 న స్థానిక జేపీ ఫంక్షన్‌హాల్ వద్ద ద్విచక్రవాహనానికి వీధి కుక్క అడ్డురాడంతో కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు వెంటనే ఆయన్ను హైదరాబాద్‌కు తరలించారు. పరిస్థితి విషమించడంతో బుధవారం అక్కడే మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ యుగంధర్ తెలిపారు.

టికెట్ లేని ప్రయాణికులపై దాడులు

గుంతకల్లు: డివిజన్ వ్యాప్తంగా రైళ్లలో టికెట్ లేకుండా ప్రయాణిస్తున్న దాదాపు 5343 మంది నుంచి రూ. 37.06 లక్షలు జరిమానా విధించినట్లు సీనియర్ డీసీఎం మనోజ్ బుధవారం తెలిపారు. మంగళవారం ఒకే రోజు వివిధ ఎక్స్‌ప్రెస్, ప్యాసింజర్ రైళ్లలో తమ సిబ్బంది విస్తృత తనిఖీలు నిర్వహించినట్లు చెప్పారు. టిక్కెట్ లేకుండా ప్రయాణిస్తున్న 5,343 కేసులు నమోదు చేసి జరిమానాగా రూ.37.06 లక్షలు వసూలు చేశామని, ఇప్పటి వరకు డివిజన్‌లో ఇదే అత్యధికమన్నారు.

సంక్షిప్త సమాచారం

టెక్ కళాశాలలో జీఎస్టీపై అవగాహన



సీఏకు జ్ఞాపికను అందిస్తున్న దృశ్యం

తాడిపత్రిటౌన్: పట్టణంలోని తాడిపత్రి ఇంజనీరింగ్ కళాశాలలో జీఎస్టీ తగ్గింపుపై పట్టణానికి చెందిన చార్టెడ్ అకౌంటెంట్ మధుసూదన్‌గుప్తా అవగాహన కల్పించారు. ఏఏ రంగాల్లో జీఎస్టీ తగ్గించారు, ఏఏ వస్తువుల ధరలు తగ్గుతాయి తదితర అంశాలను తెలియజేశారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ సురేష్‌రెడ్డి ఆయన్ను శాలువాలతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ప్రిన్సిపాల్ ఈవీ సుబ్బారెడ్డి, డైరెక్టర్ నటరాజేశ్వరరెడ్డి, నిహారిక, షాలిని, వైస్ ప్రిన్సిపాల్ భానుప్రసాద్ పాల్గొన్నారు.

భార్యపై దాడి చేసిన కేసులో భర్త అరెస్టు

తాడిపత్రి రూరల్: భార్యపై కత్తితో దాడి చేసిన కేసులో నిందితుడిని పోలీసులు అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచారు. సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపిన వివరాలు.. పుట్లూరు మండలం కడవకల్లుకు చెందిన సురేష్ భార్యతో కలిసి తాడిపత్రికి వలస వచ్చి పాతకోటలో నివాసం ఉండేవాడు. కుటుంబ కలహాలతో 2018లో భార్యపై దాడి చేసిన కేసులో కోర్టు వాయిదాలకు హాజరుకాకుండా పరారీలో ఉన్నాడు. సురేష్‌పై తాడిపత్రి మెజిస్ట్రేట్ నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేశారు. నిందితుడు కడవకల్లులో ఉండగా అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచారు. మెజిస్ట్రేట్ ఆదేశాల మేరకు నిందితుడికి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

వరదాయపల్లిలో ఘర్షణ

పెద్దపప్పూరు: వరదాయపల్లిలో బుధవారం డబ్బు విషయమై గ్రామానికి చెందిన లక్ష్మీనారాయణ, వెంకటరాముడు మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. కర్రలతో ఇరువురు దాడి చేసుకోవడంతో సల్పగాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న ఎస్ఐ నాగేంద్ర ప్రసాద్ సంఘటనా స్థలానికి చేరుకొని బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

బాల్య వివాహాలను అరికడదాం

తాడిపత్రి రూరల్: బాల్య వివాహాలను అరికడదామని సీడీపీఓ సాజిదాబేగం తెలిపారు. పట్టణంలోని పెన్నానది ఒడ్డున గల కాలక్షేపం మండలంలో బుధవారం ఐసీడీఎస్ ప్రాజెక్టు సమావేశం జరిగింది. ఈసందర్భంగా సీడీపీఓ బాల్యవివాహాలతో కలిగే అనర్థాలు, చట్టాలను వివరించారు. అనంతరం పౌష్టికాహార ప్రదర్శనను ఏర్పాటు చేశారు. సూపర్‌వైజర్లు రామలక్ష్మి, లక్ష్మిదేవి, ఉమాదేవి, విజయ పాల్గొన్నారు.

పుట్లూరు: పుట్లూరు, కడవకల్లు గ్రామాల్లో బుధవారం పోషకాహార వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆహార పదార్థాల ప్రదర్శన చేపట్టడంతో పాటు తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు. సీడీపీఓ భారతి, ఎంపీడీఓ అలివేలమ్మ, ఎంఈఓ శ్రీదేవి, సూపర్‌వైజర్లు లావణ్య, నాగమణి హౌసింగ్ ఏఈ సంధ్య, ఏపీఎం వెంకటరామిరెడ్డి పాల్గొన్నారు.

సమాచార లోపం.. ప్రజలకు శాపం

తాడిపత్రిటౌన్: అధికారుల సమాచార లోపం ప్రజలకు శాపంగా మారింది. పట్టణ సమీపంలోని తేరన్నపల్లి 220 కేవీ విద్యుత్ స్టేషన్‌లో పనుల నిమిత్తం అధికారులు బుధవారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేశారు. ముందస్తు సమాచారం లేకుండా విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో పట్టనంలోని పలు సచివాలయాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు, సిబ్బంది సరిగా విధులు నిర్వహించలేని పరిస్థితి నెలకొంది. ప్రధానంగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్టర్ స్లాట్ బుక్ చేసుకున్న భూ కొనుగోలుదారులకు రిజిస్ట్రేషన్ స్లాట్ పరిమిత సమయం దాటిపోవడంతో అదనంగా రీ షెడ్యూల్ చలానా చెల్లించాల్సి వచ్చిందని వాపోయారు.

గురుకుల పాఠశాల నిర్మాణానికి శంకుస్థాపన

బుక్కరాయసముద్రం: సిద్దరాంపురం రోడ్డు సమీపాన దేవరకొండ వద్ద ఏపీ గురుకుల పాఠశాల నిర్మాణానికి బుధవారం అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే బండారు శ్రావణి శంకుస్థాపన చేశారు. జీజీయూఏ పథకం కింద రూ. 5.38 కోట్లతో గురుకుల బాలురు పాఠశాల నిర్మిస్తున్నట్లు వారు తెలిపారు. బీకేఎస్ నుంచి పప్పూరు వరకూ రూ.2.5 కోట్లతో తారు రోడ్డు నిర్మించనున్నట్లు పేర్కొన్నారు. ఆర్డీఓ కేశవ నాయుడు, తహసీల్దార్ శ్రీధర్‌మూర్తి, ఎంపీడీఓ సాల్మాన్, ఏపీఎం అనిత తదితరులు పాల్గొన్నారు.